రైతులకు కష్టాలు తప్పేనా..?

- గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కరువు
- ధాన్యం సేకరణలో ఇబ్బందులు
- ఈసారి సమస్యలు రానివ్వద్దంటున్న అన్నదాతలు
- దోపిడీని అరికట్టాలని అధికారులకు వేడుకోలు


కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

లోకేశ్వరం: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించి.. గతేడాది తలెత్తిన సమస్యలను పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు. సరిపడా గన్నీ సంచులు తెప్పించడంతోపాటు తూకం వేసిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు తరలించాలని రైతులు అంటున్నారు. ముఖ్యంగా ధాన్యం తూకం, రవాణా విషయంలో దళారులను ప్రోత్సహించవద్దని కోరుతున్నారు.

జిల్లాలో..

జిల్లాలో గతంలో కంటే ఈసారి వరిసాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాకాలంలో లక్షా 25వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. స్వర్ణ, కడెం, గడ్డెన్నవాగు, గోదావరి నది పరివాహక ప్రాంతాల రైతులు అధిక శాతం వరి సాగుకు మొగ్గు చూపారు. ఈసారి కొనుగోలు కేంద్రాలకు లక్షా 36 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం రావచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. గతంలో మాదిరి ఈసారి కూడా జిల్లావ్యాప్తంగా 220 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గతంలో ఎదురైన ఇబ్బందులు..

- గతేడాది కొనుగోలు కేంద్రాలకు కొత్త గన్నీ బ్యాగులు(గోనెసంచులు) సరఫరా చేయాల్సి ఉన్నా.. చాలా కేంద్రాల్లో పాతవాటినే రైతులకు అందించారు. అవీ సకాలంలో రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యాన్ని తూకం వేయలేదు. దీంతో కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు గాశారు.
- ధాన్యం తూకం వేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగానే కన్పించింది. దీంతో కొన్నిచోట్ల నిర్వాహకులే దళారులుగా వ్యవహరించి తూకం విషయంలో జోక్యం చేసుకోవడం కనిపించింది.
- తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే విషయంలో కొనుగోలు కేంద్రాల సిబ్బంది సైతం చేతులెత్తేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.
- లారీల్లో తీసుకొచ్చిన ధాన్యాన్ని మాత్రమే అన్‌లోడ్ చేస్తామని.. ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చిన ధాన్యాన్ని తీసుకోబోమని తేల్చిచెప్పారు.
- కొనుగోలు కేంద్రంలో వేసిన తూకానికి ,రైస్‌మిల్లులో వేసిన తూకానికి క్వింటాళ్లలో వ్యత్యాసం రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు.

సౌకర్యాలు కల్పించాలి..



ధాన్యం తూకం వేయడం మొదలుకొని రవాణా చేసే విషయంలో చిన్న రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– గన్ను నర్సారెడ్డి, పుస్పూర్

అన్ని రకాలుగా నష్టపోతున్నాం



రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. కొనుగో లు కేంద్రాల వద్ద సిబ్బంది రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యాన్ని అధికంగా తూకం వే స్తున్నారు. దీంతో అన్ని రకాలుగా నష్టపోతున్నాం.

– ఆనందం, రాయపూర్‌కాండ్లీ

ఇబ్బందుల్లేకుండా చూస్తాం

ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్లు వంటివి ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. ఎప్పటికప్పుడు కాంటాలు పూర్తి చేసి మిల్లులకు పంపిస్తున్నాం.

– శ్రీకళ, సివిల్ సప్లయ్ డీఎం, నిర్మల్

ప్రజలు ఆలోచించి ఓటేయండి

- ఎన్నికలప్పుడే బీజేపీ, కాంగ్రెస్ నేతలకు ప్రజలు గుర్తుకొస్తారా?
- బీఆర్ఎస్‌తోనే నిర్మల్ మరింత అభివృద్ధి
- మరోసారి ఆశీర్వదించి గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


నిర్మల్‌లోని బుధవార్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఎవరి వల్ల నిర్మల్‌కు మంచి జరుగుతుందో.. ఎవరూ అందుబాటులోఉండి ప్రజాసమస్యలు పరిష్కరిస్తారో ఆలోచించి వారికే ఓటేయాలని నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ నియోజకవర్గ ప్రజలు తనను మరోమారు ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని పింజరిగుట్ట, బుధవార్‌పేట్, హరిజనవాడ, గొల్లపేట్, దివ్యనగర్, ఏఎన్‌రెడ్డి కాలనీ, సోమవార్‌పేట్, జుమ్‌రత్‌పేట్, చింతకుంటవాడ, బేస్తవార్‌పేట్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నాయకులతో కలిసి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజలు గుర్తుకొస్తారా అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ తెలంగాణకు చేసిందేం లేదని.. బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే నిర్మల్‌ను ప్రత్యేక జిల్లాగా చేసి మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామన్నారు. 2009 నుంచి 2014 వరకు నిర్మల్ ఎమ్మెల్యేగా పని చేసిన మహేశ్వర్‌రెడ్డి నిర్మల్ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం స్థానిక దివ్యాగార్డెన్‌లో పద్మశాలి సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, అప్పాల ప్రభాకర్, పాకాల రాంచందర్, అప్పాల మహేశ్, పూదరి సాయికష్ణ, గంట రాకేశ్, నేరెళ్ల సాయి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, నేరెళ్ల వేణు కాలనీవాసులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని కప్పన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాంకిషన్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులున్నారు.


లక్ష్మణచాంద: పీచరలో మహిళలతో దివ్యారెడ్డి

సోన్: మండల కేంద్రానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బుధవారం నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి తనయుడు గౌతమ్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాస్, అంబేకర్ ప్రసాద్, గంగాధర్, కాంతయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. మాదాపూర్‌లో ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసభ్యులు ప్రచారం నిర్వహించారు. వినోదమ్మ, పల్లవి, దివ్యారెడ్డి తదితరులున్నారు.

దివ్యారెడ్డి ప్రచారం..

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని మంత్రి కోడలు అల్లోల దివ్యారెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని పీచర గ్రామంలో బుధవారం ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పథకాలను వివరించారు. ధర్మారంలోని మహాపోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, పీచర సర్పంచ్ లత, భూమేశ్, లస్మన్న, భూమన్న, ముత్యం, తలారి వర్ధన్, రాజు పాల్గొన్నారు.

'ఉద్యమంలో శ్రీహరిరావు పాత్ర లేదు'

నిర్మల్‌టౌన్: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు పాత్రే లేదని.. 2001లో తెలంగాణ కోసం 41 మంది ప్రజాప్రతినిధులతో తీర్మానం చేయించి సోనియాగాంధీకి పంపిన ఘనత ఇంద్రకరణ్‌రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధులు అమరవేణి నర్సగౌడ్, ముడుసు సత్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడారు. ఆంధ్ర నుంచి నిర్మల్‌కు వలస వచ్చిన వారి నుంచి చందాలు వసూలు చేస్తూ పబ్బం గడిపిన వ్యక్తి శ్రీహరిరావు అని విమర్శించారు. నిర్మల్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ రాదని..జిల్లా కేంద్రంలో నిర్వహించిన రేవంత్‌రెడ్డి సభకు జనమే రాలేదన్నారు. ఓటుకు నోటు కేసులో దొంగ అయిన రేవంత్‌రెడ్డి.. ఇంద్రకరణ్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్


కామోల్‌లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని దేగాం, కామోల్ గ్రామాల్లో బుధవారం స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసారూరల్ సీఐ నైలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ముప్పు


బోల్తాపడిన ట్రాక్టర్

భైంసా: గడ్డికట్టల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బుధవారం బాసరలోని వంతెనపై అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించి పక్కకు దూకడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

బీజేవైఎం కోఆర్డినేటర్‌గా రాజు


సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఠాకూర్ అర్జున్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీజేవైఎం మండల కోఆర్డినేటర్‌గా పల్లపురాజు (నర్సాపూర్(జి)), ప్రధాన కార్యదర్శిగా నడిపొల్ల రాజశేఖర్ (రాంపూర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి నరేందర్, గంగారాం, దత్తురాం, లక్ష్మణ్, మహేశ్, సాయికృష్ణ, శివ, గంగన్న, ప్రవీణ్, రాములు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ అమర్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డిప్యూటి డీఎంహెచ్‌వో రాజేందర్, సూపరింటెండెంట్ వంశీమాధవ్ తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కుంటాల: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దౌనెల్లి పంచాయతీలోని దౌనెల్లి తండాలో ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ధనం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులకు భయపడకుండా ధైర్యంగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి వెంట హెడ్ కానిస్టేబుల్ ఆస్యం గంగాధర్, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

'రమాదేవి ఆరోపణలు అవాస్తవం'


మాట్లాడుతున్న రాజేశ్‌బాబు

ముధోల్: తనపై బీఆర్ఎస్ నాయకులు రమాదేవి చేసిన ఆరోపణలు అవాస్తవమని.. వాటిని ఖండిస్తున్నట్లు బీజేపీ నాయకులు, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్‌తండా చుట్టు పక్కల గ్రామాలకు నీరు రాకపోవడానికి కారణం రాజేశ్‌బాబు అనడం అర్థరహితమన్నారు. బీఆర్ఎస్‌లో చేరేందుకు ఎంత ప్యాకేజీ తీసుకున్నారో అందరికీ తెలుసని.. మరోసారి ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యంరెడ్డి, రమేశ్, సతీశ్, శ్రీనివాస్, కదం సంతోష్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

'దళితుల మధ్య చిచ్చుపెట్టొద్దు'


మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: కలిసిమెలిసి ఉంటున్న దళితుల మధ్య కేంద్రప్రభుత్వం చిచ్చుపెట్టి ఎస్సీ వర్గీకరణ చేయొద్దని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న, జిల్లా కన్వీనర్ సత్యం శ్యామ్ అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ చేస్తే కర్ణాటకలో బీజేపీకి పట్టిన గతే తెలంగాణలోనూ పడుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే రాజకీయ పార్టీలకు మాలలంతా కలిసి గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బేర తిరుమలేశ్, లక్ష్మినర్సయ్య తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానం పొందిన వారితో సిబ్బంది

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇటీవల బదిలీపై వెళ్లగా ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ అధ్యక్షతన వారిని బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. శ్రీనివాసమూర్తి, చక్రధర్, రాజేశ్వర్, ప్రమోద్, శేఖర్‌ను తోటి ఉపాధ్యాయులతోపాటు పలువురు పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన శ్రీనివాసమూర్తి పాఠశాలకు రూ.ఆరు వేల విలువైన మ్యూజికల్ ఎంప్లిఫైర్‌ను విరాళంగా అందించారు.

ఓటింగ్‌పై అవగాహన



శివాజీచౌక్ వద్ద ఈవీఎం కటౌట్



ఆర్డీవో కార్యాలయం ఎదుట సెల్ఫీ పాయింట్ వద్ద ఐకేపీ సిబ్బంది

ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్‌శాతం పెంచేందుకు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట, శివాజీచౌక్ వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి ఓటుహక్కు ప్రయోజనాలను వివరిస్తున్నారు. పోలింగ్ తేదీ, ఈవీఎం కటౌట్‌లతో కూడిన హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

బీజేపీ గెలిస్తేనే నిర్మల్ అభివృద్ధి

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


సోన్: న్యూవెల్మల్‌లో నాయకుల ప్రచారం

లక్ష్మణచాంద: బీజేపీ గెలిస్తేనే నిర్మల్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి సురేశ్, వెంకటరమణ, రాములు జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బీజేపీలో చేరారు. మహేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జీవన్‌రెడ్డి, మల్లేశ్, సుధాకర్‌రెడ్డి, హుస్సేన్, భూమన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.


నిర్మల్‌లో మహేశ్వర్‌రెడ్డికి విరాళం ఇస్తున్న మామడ మండలం కొరిటికల్ గ్రామ రైతులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో బుధవారం బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగయ్య, అంకం శ్రీనివాస్, సాగర్, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ఏలేటి'కి రూ.లక్ష అందించిన కొరిటికల్ రైతులు

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామ రైతులు బుధవారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి రూ.లక్ష విలువైన చెక్కును జిల్లా కేంద్రంలోని తన నివాసంలో అందించారు. ఎన్నికల ఖర్చు కోసం స్వచ్ఛందంగా విరాళం ఇస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. బాపురెడ్డి, చక్రపాణి, చిన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని 7, 8 వార్డుల పరిధిలో పలువురు ముస్లింలు మాజీ ఎంపీటీసీ జమీల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తనపై కొందరు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దని ప్రజలను కోరారు. ఖానాపూర్ మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే షాదీ ముబారక్‌తోపాటు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, మైనార్టీలకు రుణాలు అందించారన్నారు. రాజేందర్, ఖలీల్, రామునాయక్, సురేశ్, రాజన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గెలిపించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆ ర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్, దుబ్బగూడ గ్రామాల్లో ఎన్నిక ల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం సమావేశం నిర్వహించి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. షేక్ సుఫీయన్, డోంగ్రే గణేశ్, పద్వాల్ గోపాల్‌సింగ్, మెస్రం తుకారం, కోవ రాజేశ్వర్, కనక హన్మంత్‌రావు పాల్గొన్నారు.

బజ్జీలు అమ్మిన జెడ్పీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ ఉట్నూర్ పట్టణంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. దుకాణంలో బజ్జీలు వేశారు. ధరణి రాజేశ్, వాసు పాల్గొన్నారు.

ఆశ్రమానికి రూ.ఐదువేల విరాళం

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన హరీశ-సంతోష్ దంపతుల కూతురు జాదవ్ నిర్విన్ తన పుట్టినరోజు వేడుకలను భైంసాలోని వివేకానంద అనాథ ఆశ్రమంలో బుధవారం నిర్వహించారు. ఆశ్రమంలోని విద్యార్థులకు మిఠాయిలు పంచి.. నిర్వాహకులకు రూ.ఐదు వేలు అందించారు. ఆశ్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభకు తరలిన నాయకులు


సభ ప్రాంగణం వద్ద నాయకులు

లక్ష్మణచాంద: నిర్మల్‌లో క్రషర్ గ్రౌండ్‌లో నిర్వహించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు తమ గ్రామాల నుంచి తరలివెళ్లారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు అట్ల రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, రాజేందర్ ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

కేజీబీవీలో ఉపన్యాస పోటీలు


ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

తానూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని బి.సంధ్యారాణి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలేఖ్య, ఉపాధ్యాయులు భూమన్నయాదవ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.